

# డేంజర్ డాగ్స్

**ప్రాణాలు తీస్తున్న వీధికుక్కలు • రాష్ట్రంలో సగటున రోజుకు 70 దాడులు • రేబిస్‌తో సగటున ఇద్దరు దుర్మరణం**

**గడిచిన 206 రోజుల్లో 239 ఘటనలు • 7 నెలల్లో 15 మంది బలి • విశాల్ కేసు సుమోటోగా స్వీకరించిన హైకోర్టు**

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : ఒకప్పుడు వీధి కుక్కలంటే ఆ వాడకు రక్షణగా ఉండేవి. ఎవరైనా అపరిచితులు వచ్చినా, రాత్రి పూట ఆగంతకులు చొరబడినా పసిగట్టి మొరుగుతూ ప్రజలను అప్రమత్తం చేసేవి. కానీ, ఇప్పుడు అవే కుక్కలు ప్రజలు, ముఖ్యంగా పసిపిల్లల పాలిట మృత్యుమృగాలుగా మారాయి. ఒంటరిగా దొరికినా, బంధువుల రక్షణలో ఉన్నా వెంటపడి మరీ దాడి చేసి ఒక్కోసారి ప్రాణాలు తీస్తున్నాయి. రాష్ట్రమంతటా ఏదోఒకచోట కుక్కకాటు కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఇటీవల ఆరేండ్ల బాలుడిని వీధి కుక్కలు దాడిచేసి చంపేసిన ఘటన జాతీయ పత్రికల్లో పతాక శీర్షికగా నిలిచింది. ఆ కేసును రాష్ట్ర హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తున్నది.

### ఏడు నెలల్లోనే 15 మంది దుర్మరణం

డిసెంబర్ 12 నుంచి ఈ నెల 2వరకు 206 రోజుల్లో 239 కుక్కకాటు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక్కోచోట 10 నుంచి 15మంది వరకు గాయపడ్డారు. ఈ ఏడు నెలల్లోనే కుక్కల దాడిలో 15 మంది చనిపోయారు. వీరిలో కొందరు రేబిస్‌తో మరణించారు. గుంపులుగా తిరిగే కుక్కలు మూగజీవాలపైనా దాడి చేస్తున్నాయి. గొర్రెలు, పశువులపై విరుచుకుపడుతున్నాయి.

### కుక్కకాటుతో వచ్చే వ్యాధులు

రేబిస్, మెదడువాపు, బ్రూసెల్లోసిస్, క్షయ, సాల్మనెల్లోసిస్, లెప్టోస్పైరిన్, ప్లేగు, బర్డ్‌ఫ్లూ, అంత్రాక్స్ , దవడ, గొంతు పక్షవాతం , నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయం

## పూర్తి వివరాలు ఇవ్వండి: హైకోర్టు

**చిన్నారులపై** కుక్కల దాడుల ఘటనలపై రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా స్పందించింది. జూన్ 29న విశాల్ (6)ను కుక్కలు దాడిచేసి చంపిన కేసును సుమోటోగా స్వీకరించింది. గతంలో అంబర్‌పేటలోని ఎరుకల బస్తీలో వీధి కుక్కలు స్కూల్‌కు వెళ్లే చిన్నారులపై దాడిచేయగా ఓ బాలుడు చనిపోవడం, అంతకుముందు జరిగిన దాడులకు ఈ కేసును జతచేసింది. ఇలాంటి ఘటనల్లో బాధితులపై కనికరం చూపాలని, కేవలం పరిహారం చెల్లిస్తే సరిపోదని, కుక్కల దాడులు పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం సమర్థవంతమైన విధానాలను రూపొందించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని బెంచ్ ఆదేశించింది. రాష్ట్ర సీఎస్, ఆరోగ్య కార్యదర్శి ఈ ఘటనపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీచేసి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది.

## 15మంది మృతుల వివరాలు

**2023, డిసెంబర్ 15 :** గోల్కొండ విభానగర్‌లో గుడిసెలో ఉన్న 5 నెలల శరత్‌పై కుక్కలు దాడి చేశాయి. మెడ, తల, ముఖంపై తీవ్రగాయాలు కావడంతో దవాఖానల్లో చికిత్సపొందుతూ చనిపోయాడు.

**2024, జనవరి 9:** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కల్లేడికి చెందిన ఐదేండ్ల హర్షవర్ధన్‌పై మేకల కాపరుల కుక్కలు దాడిచేయగా చికిత్స పొందుతూ చనిపోయాడు.

**జనవరి 29:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్లలో ఓ వ్యక్తిపై కుక్కలు మూకుమ్మడిగా దాడిచేయడంతో దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.



**ఫిబ్రవరి 2 :** శంషాబాద్ రాజీవ్ గృహ కల్ప సామ ఎన్‌క్లేవ్ సమీపంలో కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్న ఏడాది వయస్సున్న నాగరాజును కుక్కలు నోటకరుచుకొని బయటకు లాక్కొచ్చి చంపేశాయి.

**ఫిబ్రవరి 8 :** కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చాపేటలో ఆరుగుపై కూర్చున్న రామవ్వ(60)పై కుక్కల గుంపు దాడిచేయడంతో చనిపోయింది.

**మార్చి 23 :** ఆదిలాబాద్ జిల్లా పెంబి మండలం తాటిగూడకు చెందిన నాలుగేండ్ల శాన్వీక.. పిచ్చి కుక్కలు దాడితో చికిత్స పొందుతూ మృతిచెందింది.

**మార్చి 31 :** నిజామాబాద్ జిల్లా నందిపేటకు చెందిన బొడ్డు మహేశ్ (34) లక్కంపల్లి శివారు సెజ్‌లో వాచ్‌మెన్. గేటు వద్ద నిద్రిస్తున్న ఆయన కుక్కల దాడితో చికిత్స పొందుతూ చనిపోయాడు.

**ఏప్రిల్ 2 :** రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారానికి చెందిన అరుణ్ (28)పై కుక్కలు దాడిచేయగా రేబిస్ సోకి మృతిచెందాడు.

**ఏప్రిల్ 13 :** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లికి చెందిన తుడుం నరేందర్(30)పై కుక్కలు దాడి చేయగా సరైన చికిత్స చేయించుకోక ఐదు నెలల తర్వాత చనిపోయాడు.

**ఏప్రిల్ 14 :** హైదరాబాద్‌లోని పేట్‌బషీర్‌బాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐదేండ్ల దీపాలి ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేశాయి. చికిత్స పొందుతూ చనిపోయింది.

**మే 15 :** వికారాబాద్ జిల్లా తాండూరులో ఐదు నెలల బాలుడిపై ఇంట్లోకి చొరబడి కుక్క దాడిచేసి చంపేసింది.

**జూన్ 6 :** హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఆరేండ్ల సాత్విక్‌ను కుక్కల మంద దాడిచేసి చంపేసింది.

**జూన్ 9 :** జనగామ జిల్లా చిల్పూరు మండలం ఫత్తేపూర్ శివారు లూనావత్‌తండాలో ఆరేండ్ల గుగులోత్ అభిరామ్‌ను కుక్కలు పొలాల్లోకి లాక్కెళ్లి చంపేశాయి.

**జూన్ 18 :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లిలో 45రోజుల అయాన్స్‌ను కుక్క నోటకర్చుకుని వెళ్లింది. బాలుడు చికిత్స పొందుతూ మరుసటి రోజే చనిపోయాడు.

**జూన్ 29 :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బీహార్‌కు చెందిన విశాల్ (6)పై వీధి కుక్కలు దాడిచేసి తలకొరికి చంపేశాయి.

### మరికొన్ని ఘటనలు


- హైదరాబాద్ రెహ్మత్‌నగర్ మధురానగర్‌లో ఓ పెంపుడు కుక్క కారణంగా రెండు కుటుంబాలు ఘర్షణ పడి కర్రలతో కొట్టుకొని చావుబతుకుల మధ్య ఐసీయూలో చేరి చికిత్స పొందాయి. పరస్పరం క్రిమినల్ కేసులు పెట్టుకున్నాయి.
- హైదరాబాద్‌లో ఇంట్లోంచి కుక్క దూసుకురావడంతో భయపడి ఫుడ్ డెలివరీ బాయ్ మూడో అంతస్థు నుంచి దూకి తీవ్రంగా గాయపడ్డాడు.

### కుక్కకాటు కేసులు

| 2022 | 2023 |
|---|---|
| 19,847, | 26,349 |

- కుక్కలదాడుల్లో సగటున రోజుకు 70 మందికి గాయాలు
- నెలకు ఇద్దరు చొప్పున రేబిస్ వ్యాధితో మరణిస్తున్నారు.
- 2019-2014 ఏప్రిల్‌లోపు హైదరాబాద్‌లోనే 54మంది మృత్యువాత
- ఒక్క హైదరాబాద్‌లోనే 5.50 లక్షల వీధి కుక్కలున్నట్టు అంచనా
- డిసెంబర్ 12 నుంచి జూలై 2 వరకు 239 ఘటనలు
- కుక్కకాటుతో ఏడు నెలల్లో 15 మంది చనిపోయారు.
- చనిపోయిన మూగ జీవాల సంఖ్యకు లెక్కలేదు.
- దేశవ్యాప్తంగా ఉన్న కుక్కలు 1.53 కోట్లు
- రేబిస్‌తో దేశంలో ఏటా 20 వేలమంది మృత్యువాత
- సుమారు 2కోట్ల మంది దవాఖానల పాలు
- ప్రపంచవ్యాప్తంగా పోలిస్తే దేశంలోనే 36శాతం మరణాలు
- ఎండకాలంలో తాపాన్ని తట్టుకోలేక కుక్కలు దాడికి ప్రయత్నిస్తాయి.
- కుక్కకాటుతో దాదాపు 19 రకాల వ్యాధులు వస్తాయి
- పెంపుడు కుక్కలకు తరచూ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి.
- వీధి కుక్కలకు వైద్యాధికారులు కు.ని ఆపరేషన్లు చేయాలి.

## లోకం పోకడ




ఈ ప్రభుత్వం నిర్వహించే
డీఎస్సీ పరీక్షకు ఇలా ప్రిపేర్ అవుతున్నా మమ్మీ!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 35.4°c | 23.6°c |
| రంగారెడ్డి | 34.7°c | 22.1°c |
| నిజామాబాద్ | 30.4°c | 23.3°c |
| ఖమ్మం | 31.0°c | 26.0°c |
| మెదక్ | 30.9°c | 22.8°c |
| హైదరాబాద్ | 30.8°c | 23.6°c |
| కరీంనగర్ | 30.0°c | 26.0°c |
| నల్లగొండ | 30.0°c | 23.0°c |
| వరంగల్ | 30.0°c | 25.0°c |
| మహబూబ్‌నగర్ | 28.8°c | 23.5°c |

## రాష్ట్రంలో భారీ వర్షాలు

**19న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం**

**వచ్చే 5 రోజులు భారీ వానలు**

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తన ప్రభావంతో గడిచిన 24గంటల్లో నిజామాబాద్, ఆదిలాబాద్ , ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నవీపేటలో 15.4 సెం.మీ, ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో 13.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాగల ఐదురోజులు రాష్ట్రంలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 19నాటికి పశ్చిమ మధ్య ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొన్నది. ఈ మేరకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. గురు, శుక్రవారాల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని వెల్లడించారు. అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లను 1070, 112, 18004250101 ఏర్పాటు చేసినట్టు విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులు పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పునే తప్పుబడుతున్నారా?



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్తు కమిషన్‌కు కేసీఆర్ రాసిన లేఖలో జస్టిస్ నర్సింహారెడ్డి వ్యక్తిగత విషయాలను ఎక్కడా ప్రస్తావించలేదని, తీసుకున్న నిర్ణయాలను మాత్రమే తప్పుబట్టారని పేర్కొన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు నర్సింహారెడ్డిని బాధ్యతల నుంచి తప్పించిందని తెలిపారు. రాజీనామా తర్వాత నర్సింహారెడ్డి స్థాయి మరిచి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌పైనా, ఎమ్మెల్సీ కవితపైనా ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. కేసీఆర్ ఇంకా సమాధానం ఇవ్వలేదని అంటూనే కమిషన్ నివేదిక సిద్ధం అయిందని ఎలా చెప్తారని ప్రశ్నించారు. దీనినిబట్టి ఆయన దురుద్దేశాలు అర్థమవుతున్నాయని విమర్శించారు. విచారణ ఎదుర్కొంటున్న కవితను దోషి అన్నట్టు ఎలా మాట్లాడతారని నిలదీశారు. కోర్టు తీర్పును తప్పుబట్టి నర్సింహారెడ్డిపై ఆర్టికల్ 142 ప్రకారం చర్యలు ఎందుకు తీసుకోకూడదని ప్రశ్నించారు. నర్సింహారెడ్డి భూకబ్జాలకు పాల్పడ్డారని అప్పట్లో పీసీసీ చీఫ్‌గా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు ఉద్యమం కూడా చేశారని, మరిప్పుడు ఆయననే విచారణ కమిషన్ చైర్మన్‌గా ఎలా నియమించారని ప్రశ్నించారు. నర్సింహారెడ్డిని విద్యుత్తు కమిషన్ చైర్మన్‌గా నియమించిన రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చుండూరు మారణహోమంపై హత్యచేసిన నేరస్థుల తరుపున వ్యాఖ్యానించిన జస్టిస్ నర్సింహారెడ్డిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడాలన్నారు. గతంలో నర్సిం హారెడ్డిపై సీబీఐ విచారణ చేపట్టాలని దళిత సంఘాలు ఆందోళన చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నర్సింహారెడ్డిలో ఆరెస్సెస్ మూలాలున్న సంగతి అందరికీ తెలుసని అన్నారు.

### ఒవైసీ వ్యాఖ్యల్లో అర్థంలేదు

కేశవ్ మెమోరియల్‌కు చైర్మన్‌గా ఉన్న నర్సింహారెడ్డిని కమిషన్ చైర్మన్‌గా నియమించడంపై అసదుద్దీన్ ఒవైసీ ఎందుకు స్పందించడం లేదని క్రిశాంక్ ప్రశ్నించారు. బీజేపీతో సంప్రదింపుల కోసమే కేటీఆర్, హరీశ్ ఢిల్లీ వెళ్లారన్న తప్పుడు వార్తలపై ఒవైసీ వివరణ కోరడంలో అర్థం లేదని అన్నారు. సుప్రీం కేసుల విషయమై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లారు తప్పితే అందులో ఎలాంటి రాజకీయాలు లేవని స్పష్టం చేశారు. ఒవైసీకి కేసీఆర్ జవాబుదారీ కాదని, బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు ఉత్త వదంతేని తేల్చి చెప్పారు.

# కుక్కల దాడిలో బాలుడి మృతి

• జవహర్‌నగర్‌లో తీవ్ర విషాదం



బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల, రాజకీయ నాయకులు

జవహర్‌నగర్, జూలై 17: జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో గాయపడిన బాలుడు విహాన్(16 నెలలు) చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన భరత్‌కుమార్, భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు, కుమారుడితో కలిసి జవహర్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. భరత్‌కుమార్ స్థానికంగా కార్పెంటర్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి 7గంటలకు కుమార్తెకు జ్వరంగా ఉందని తల్లి లక్ష్మి మాత్రలు తీసుకురావడానికి మెడికల్ షాపునకు వెళ్లింది. కుమారుడు విహాన్ ఆడుకుంటూ గేటు బయటకు రాగా గుంపుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తలభాగాన్ని నోట్ల కరుచుకొని చెట్లపొదల్లోకి తీసుకెళ్లాయి. కుమారుడి కోసం కుటుంబసభ్యులు వెతకుతుండగా చెట్ల పొదల్లో బాలుడు కనిపించాడు. కుక్కలను తరిమివేసి బాలుడిని స్థానిక హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. ఇద్దరు కూతుర్ల తరువాత 11ఏండ్లకు పుట్టిన కుమారుడు విగతజీవిగా ఉండడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కుక్కల దాడిలో చనిపోయిన బాధిత కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు నిరసనకు దిగారు. బాలుడి కుటుంబాన్ని ఆదుకుంటామని కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కలెక్టర్ దృష్టి తీసుకెళ్లి విహాన్ కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను మేయర్, డిప్యూటీమేయర్, కార్పొరేటర్ నిహారికగౌడ్ పరామర్శించారు. విహాన్ అంత్యక్రియలను వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో నిర్వహించారు.



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలంలోని ఉచ్చమల్లి వాగు వద్ద ఆగి ఉన్న అంబులెన్స్ వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న నిండు గర్భిణి సౌందర్య

# బురదలో గర్భిణి నడకయాతన

**ఆసిఫాబాద్ జిల్లాలో అప్రోచ్ రోడ్డు లేక అవస్థలు**

పెంచికల్ పేట్, జూలై 17 : పురిటి నొప్పులతో దవాఖానకు బయలుదేరిన గర్భిణికి అవస్థలు తప్పలేదు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలంలోని ఎర్రగుంటకు చెందిన గిరిజన మహిళ ఆత్రం సౌందర్యకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. కిలోమీటర్ దూరంలో ఉన్న ఉచ్చమల్లి వాగు లోలెవెల్ వంతెన వరకే అంబులెన్స్ వచ్చి ఆగింది. ఇటీవల వంతెన నిర్మించినా అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో బురదమయంగా మారింది. దీంతో గర్భిణి బంధువు సాయంతో బైక్‌పై వాగు వద్దకు వచ్చింది. అక్కడి నుంచి సుమారు 200 మీటర్ల బురదమయమైన రోడ్డుపై అవస్థలు పడుతూ నడుచుకుంటూ వెళ్లి అంబులెన్స్ ఎక్కింది. అక్కడి నుంచి కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు నిర్మించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## దాశరథి శత జయంతికి ప్రభుత్వ ఏర్పాట్లేవి?

హైదరాబాద్, జూలై 17(నమస్తే తెలంగాణ): అభ్యుదయ కవిసామ్రాట్ డా. దాశరథి కృష్ణమాచార్యను రాష్ట్ర సర్కారు విస్మరించిందా? అంటే సాహితీవేత్తల నుంచి అవుననే సమాధానం వస్తున్నది. తెలంగాణ సాయుధ పోరాటంలో, సాహితీ రంగంలో ఆయన విశిష్టత, ప్రత్యేకత ఉన్నది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ', 'మా నిజాం రాజు జన్మజన్మల బూజు' అనే మాటలు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015 నుంచి దాశరథి సాహితీ పురస్కారాన్ని అందిస్తున్నది. ఈ శత జయంతి సంవత్సరాన్ని గొప్పగా జరుపుకోవాలని సాహితీ ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం నుంచి వేడుకలు, పురస్కారంపై ప్రకటన రాకపోవడంపై సాహితీవేత్తలు విచారం వ్యక్తంచేస్తున్నారు.

### 22న ఎమ్మెల్సీ గోరటికి పురస్కారం

సాహితీ సాంస్కృతిక వేదిక 'మాభూమి' ఆధ్వర్యంలో ఈ నెల 22న మాభూమి- దాశరథి ప్రజా సాహిత్య పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు ప్రదానం చేయనున్నారు. హైదరాబాద్ జిల్లా అదనపు జడ్జి మురళీమోహన్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుంది.

## రవిప్రకాశ్‌కు యూరో బ్యాంక్ నోటీసులు

100 కోట్ల పరువు నష్టం దావా

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): ఆర్‌టీవీ ఎడిటర్, పబ్లిషర్ రవిప్రకాశ్‌కు లండన్‌కు చెందిన యూరో ఎక్సిమ్ బ్యాంకు రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని నోటీసులు జారీ చేసింది. పలు నిర్మాణ పనులను టెండర్లలో భాగంగా దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ సంస్థ తరపున ప్రభుత్వానికి యూరో ఎక్సిమ్ బ్యాంకు ఇచ్చిన బ్యాంకు గ్యారెంటీని దొంగ బ్యాంకు గ్యారెంటీలని పేర్కొంటూ ఆర్‌టీవీలో రవిప్రకాశ్ స్వయంగా కథనాలు ప్రసారం చేశారు. ఈ నేపథ్యంలో రవిప్రకాశ్‌కు యూరో ఎక్సిమ్ బ్యాంకు తరపున లీగల్ ఏజెన్సీ నోటీసులు జారీ చేసింది. ఈ కథనాల వల్ల కంపెనీకి ఆర్థికంగా నష్టం వాటిల్లిందని, పరువు ప్రతిష్ఠలు భంగపడ్డాయని ఆ నోటీసులో పేర్కొన్నది. తమ బ్యాంకు లండన్ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, ఇండియాలో పలు ఇన్‌ఫ్రా కంపెనీలకు బ్యాంకు గ్యారెంటీలను చట్టబద్ధంగా ఇస్తున్నదని వివరించింది. యూరో ఎక్సిమ్ బ్యాంకు వార్షిక వ్యాపారం 8 కోట్లు మాత్రమేనని ఆ కథనంలో పేర్కొనడాన్ని ఏజెన్సీ తప్పుపట్టింది. కనీసం 1,900 కోట్ల టర్నోవర్ కలిగి ఉండగా, తప్పుడు వార్తలు ప్రసారం చేసినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని, ఆ లింకులను తొలగించకపోతే కోర్టులో 100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తామని, సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బ్యాంకు తరపున చెన్నైకు చెందిన అడ్వకేట్ బీఎస్వీ ప్రకాశ్‌కుమార్ ఆర్‌టీవీ రవిప్రకాశ్‌కు నోటీస్‌లు పంపించారు.

## నేతలకు ఐటీ చెల్లింపుపై నోటీసులు

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, క్యాబినెట్ ర్యాంకు కార్యదర్శులు, ఇతరులు పొందే వేతనాలపై ఆదాయపు పన్నును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించే విధానాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఆదాయపు పన్నును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడంపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. వేతనాలు, పెన్షన్, అనర్హతపై తొలగింపు చట్టం-1953 చట్టంలోని సెక్షన్ 3(4)ను సవాల్ చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తరపున కార్యదర్శి ఎస్ శ్రీనివాసరెడ్డి దాఖలుచేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులతో పాటు క్యాబినెట్ ర్యాంకు ఉన్న సలహాదారులు, చైర్‌పర్సన్లు, పార్లమెంట్ కార్యదర్శులు కూడా ఆదాయ పన్ను చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వమే పన్ను చెల్లించేలా చట్ట సవరణ తేవడం చెల్లదని పేర్కొన్నారు. వాదనల అనంతరం ధర్మాసనం, రాష్ట్ర సీఎస్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

## బీసీ సంక్షేమానికి 2లక్షల కోట్లు కేటాయించాలి

ఎంబీసీ సంఘాల సమితి కోకన్వీనర్ కొండూరు

హైదరాబాద్, జూలై17 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమం కోసం 2 లక్షల కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని తెలంగాణ ఎంబీసీ సంఘాల సమితి రాష్ట్ర కోకన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రధాని నరేంద్రమోదీకి ఆయన లేఖ రాశారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, జనగణనలో కులగణన చేపట్టాలని ఆయన ఆ లేఖలో కొండూరు సత్యనారాయణ కోరారు.


## కుట్రదారులకు చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్‌పై దుష్ప్రచారాలకు పూనుకున్నదని మండిపడ్డారు. అలాంటి ప్రయత్నాలు ఎక్కువ కాలం నిలబడవని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేదంటే ప్రజా క్షేత్రంలో కూడా ఇలాంటి తీర్పే రావటం ఖాయమని హెచ్చరించారు. కాంగ్రెస్ చేసే దుష్ప్రచారాలకు దేవుడు కూడా తగిన బుద్ధి చెప్తాడని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ చివరికి సత్యమే గెలుస్తుందని వ్యాఖ్యానించారు.

# విజయ డెయిరీ బకాయి 120 కోట్లు

- రైతులకు శాపంగా మారిన సంస్థ నిర్లక్ష్యం
- ఈఎంఐ చెల్లింపులు నిలిపివేత
- పాడి రైతులకు బ్యాంకు నోటీసులు
- తదుపరి పరిణామాలకు మీరే బాధ్యులంటూ హెచ్చరికలు
- పాల బిల్లులు అందక రైతులకు తిప్పలు
- రుణ ఎగవేతదారులుగా బ్యాంకుల ముద్ర




హైదరాబాద్, జులై 17(నమస్తే తెలంగాణ): విజయ డెయిరీ నిర్లక్ష్యం పాడి రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వం, డెయిరీ చేసిన తప్పుల కారణంగా పాడి రైతులకు బ్యాంకులు నోటీసులు జారీ చేస్తున్నాయి. కొన్ని నెలలుగా విజయ డెయిరీ రైతులకు ప్రభుత్వం పాల బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఆయా రైతులు బ్యాంకులకు చెల్లించాల్సిన ఈఎంఐల చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రుణాలు చెల్లించాలంటూ బ్యాంకులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాయి. 'తీసుకున్న రుణాలు చెల్లించండి. లేదంటే తదుపరి పరిణామాలకు మీరే బాధ్యులు' అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఈ విధంగా చేయని తప్పులకు రైతులు బలికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనగామ జిల్లాలో ఇప్పటికే తొమ్మిది మంది రైతులకు ఒక బ్యాంకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఈ జిల్లాకు చెందిన రాధిక అనే మహిళా రైతుకు గేదెల కొనుగోలు కోసం ఐడీబీఐ బ్యాంకు నుంచి విజయ డెయిరీ రూ.80 వేల రుణం ఇప్పించింది. ఇందులో కొంత చెల్లించగా ఇంకా రూ.46,125 చెల్లించాల్సి ఉన్నది. విజయ డెయిరీ నుంచి కొన్ని రోజులుగా పాల బిల్లులు రాకపోవడంతో ఈఎంఐ చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో బ్యాంకు అధికారులు జూన్ 24న ఆమెకు నోటీసులు జారీ చేశారు. తీసుకున్న రుణం చెల్లించాలని, లేనిపక్షంలో చట్టపరంగా ముందుకెళ్తామని, తదుపరి ఘటనలకు పూర్తి బాధ్యత మీదే అంటూ స్పష్టం చేశాయి. ఈవిధంగా చాలామంది రైతులకు ఆయా బ్యాంకులు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తమ తప్పు లేకున్నా తమపై అప్పు ఎగవేతదారులుగా ముద్ర పడుతున్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### డెయిరీ నిర్లక్ష్యం... రుణ ఎగవేతదారులుగా రైతులు

ప్రస్తుతం పాడి రైతులకు విజయ డెయిరీ నుంచి రూ.120 కోట్లకుపైగా పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ప్రతి పదిహేను రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, గత మూడు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో రైతులను ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. రుణం చెల్లించకపోవడంతో రైతులను బ్యాంకులు రుణ ఎగవేతదారులుగా ప్రకటిస్తున్నాయి. సకాలంలో ఈఎంఐలు చెల్లించకపోవడంతో రైతుల సిబిల్‌స్కోర్‌పై ప్రభావం పడుతున్నది. ఇది భవిష్యత్తులో రైతులు రుణం తీసుకోవాలంటే ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉన్నది. దీంతో పాటు గతంలో పదిహేను రోజులకోసారి బిల్లులు రావడంతో ఈ డబ్బులతో ఇంటి అవసరాలు తీర్చుకునేవారు. ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో ఇంటి అవసరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం గేదెలకు దాణా కూడా పెట్టలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒకవైపు విజయ డెయిరీ నుంచి బిల్లులు రాకపోవడం, మరోవైపు బ్యాంకులు రుణం చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తుండటంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విజయ డెయిరీ నుంచి తమకే బిల్లులు రావడం లేదని, అలాంటప్పుడు ఈఎంఐలు ఏ విధంగా చెల్లిస్తామంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఈఎంఐలు చెల్లించని విజయ డెయిరీ

**పాడి** రైతులు గేదెల కొనుగోలు చేసేందుకు విజయ డెయిరీ గతంలో పలు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించింది. ప్రతినెలా రైతులకు రావాల్సిన పాల బిల్లుల నుంచి విజయ డెయిరీనే రైతుల తరపున బ్యాంకులకు ఈఎంఐలు చెల్లిస్తున్నది. నాలుగైదు నెలలుగా రైతులకు పాల బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతున్నది. గతంలో మాదిరిగా డెయిరీ రైతుల తరుపున బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించలేకపోతున్నది. దీంతో విజయ డెయిరీతో తమకు సంబంధం లేదని, రుణం చెల్లించాలంటూ బ్యాంకులు రైతులపై ఒత్తిడి చేస్తున్నాయి.